శ్రీ భోగరాజు నారాయణమూర్తిగారు "లలిత" పత్రికకు 1950లో వ్రాసిన "వొడియాలు" వ్యాసం ఇక్కడ చూడవచ్చు.....

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశం లేదని విన్నవించుకుంటూ

భవదీయుడు

వంశి

# ~ వొడియాలు ~

—: భోగరాజు నారాయణమూర్తిగారు :—

ఏంవొడియాలంటారా? గుమ్మిడి వొడియాలేనా సరే! పూరిబిండివొడియాలేనా సరే! అసలు వొడియాలంటేనే నాకు ప్రాణం. ఈవొడియాలూ ఆవొడియాలూ అన్న విచక్షణ అక్ఖర్లేదు. అయితే నేం లాభం? మాయావిడి కప్పడాలేకాని వొడియాలక్ఖర్లేదు. రెండుపుంజీలప్పడాలు నూన్లో దేవుకొని, విస్తట్లో దొంతరపెట్టి కొని, సావకాశంగా కూర్చుంది అంటే— పుర్లాంపద్దు—అఖండంవైన పనివాడితనం చూపిస్తుంది. "నీమాటో? నువ్వేంతక్కువా" అంటారేమో? మీదయవల్ల తీసి

పోనులెండి! కాస్తోకూస్తో నేనూ పసివాడితనం చూపిస్తా. వెనకటికి– మా రామచంద్రరావు బావమరిదితో పందెంవేసి రెండువందల ఆగాకరకాయలకూర తినేశాడు- జరిగిందికాబట్టి! అలా నన్ను పరీక్షచేసే దాతయేడీ? వుంటే యేకవ్యాప్తన ఒకయ్యాభై వొడియాలికి ఖర్చుచూపిస్తా.

'లడ్డూపకోడీసంవాదం' అన్నట్లు మా యింట్లో రోజూ వొడియాలప్పడాల సంవాదం జరుగుతూవుంటుంది. ఎవరేనా మహానుభావులీ సంవాదంకూడా గ్రంథం చేస్తే బాగుండును. అలాంటివారెవరేనా వుంటే జయంమాత్రం వొడియాలికిప్పించండేం! ఇప్పుడే మనవిచేసుకుంటున్నాను. తీరా అచ్చయిపోయింతరవాత చెప్తే 'టూ లేట్' అంటారు! వొడియాలు పెట్టమంటానునేనూ- అప్పడాలని కూర్చుంటుంది మాయావిడ- స్త్రీయంటే శక్తిస్వరూపం బాబూ! ఎవడితరం జయించడానికి? అందుచే అపజయ మెప్పుడూ నాదీ. జయ మెప్పుడూ మాయావిడిదే! ఎలాజయిస్తూ వుందంటారా? ఇదడగవలసిన ప్రశ్నే! వినండి మనవిచేస్తాను. గొప్ప చదరంగ పెత్తు మెత్తింది. వెండిగిన్నెలో గరిటడన్నం వేసి, రెండుగరిట్లు నెయ్యివేసి పిసికి-వొకప్పడంముక్క గుండచేసి కలిపి పిల్లకి పెట్టడానికి ప్రారంభించినది. క్రమంగా మా నాన్నికి అప్పడంతో భోజనం అలవాటయిపోయింది. యేపూట అప్పడం లేకపోతే ఆపూటన్నం తిండు. వూరికే యేడుస్తూ కూర్చుంటుంది. పిల్ల యేడుస్తూవుంటే నా కన్నం సాయించదు. ఇంకా నాలుగురోజులికప్పడాలయిపోతాయనగా ముందుగానే మాయావిడ, కో ఆపరేటివు బ్యాంకు నోటీసులాగ నాకు నోటీసిస్తూవుంటుంది. మినపప్పు తేనా? మానా? తెచ్చి తీరాలి కాని యెవడివశం మానడానికి? అందుకే ఆడదాన్ని జయించడం కష్టంపని నా ముఖ్య- జయించాడో గొప్ప ప్రయోజకుడే! వాడే గొప్ప హీరో. ఇంటగెలిచి రచ్చగెలవాలన్న సామెత యెందుకు పుట్టిందనుకున్నారు? ఇందుకే! ఇంట అంటే పెళ్ళాము. రచ్చ అంటే రాజ్యం. పెళ్ళాన్ని గెలవగలిగినవాడు వొకరాజ్యం గెలవగలడూ అని తాత్పర్యం. అటువంటివాళ్ళ జీవితాలు యేర్చి రాయండయ్యా యెవరేనా మహానుభావులు! కార్లైలురాసిన 'హీరోవర్షిప్పు' లాంటి గ్రంథం తయారవుతుంది! కాని దేశంలో అలాంటి హీరోలెవరేనా వున్నారా యని నాసందేహం. వుంటే మనవాళ్ళిదివరకే రాసేసుందురు.

వొడియాలు నీకూ అప్పడాలు మా యావిడకీ అంత యిష్టంవయితే, ఆ తెచ్చిన మినప్పప్పుతో యివికొన్నీ యవికొన్నీ పెట్టుకొని రాజీపడండని చెప్పేపాటి పెద్దమనుష్యులు మా యిరుగుపొరుగుల్లో యె

వసూ లేకపోయారా యని యడగండి! పెద్దమనుషులు లేకపోలేదు. మా పొరుగునే, చిరకాలంనుండి వూరిబిండివాడియాల వర్తకంలో ఆరితేరిన కోమటి కన్నమ్మవుంది. ఆవిడ పెద్దమనిషే. పెద్దమనిషి కాకుండ సలభై యేళ్లెలావచ్చాయి? పాపంకన్నమ్మ నాకూ మా మావిడికి రాజీ చెయ్యాలని దఫాదఫాలు ప్రయత్నంచేసింది. పొరుగునే వుందేమో మావుభయులమీద కెల్లభిమానం. అందులో మానాన్నమీద పంచప్రాణాలున్నా. ఏడిచినప్పుడల్లా దుకాణంమీదున్న వోపంచదార పొంగో నాలుగు సెనగ్గింజలో తెచ్చి యిస్తూవుంటుంది. కాని కన్నమ్మ కెంత ముద్దో కన్నమ్మంటే మానాన్నకంత భయం. ఒఖ్ఖమానాన్నికే కాదు. మా వీధులోవున్న పిల్లలందరికీకూడా హడలే. కన్నమ్మ కప్పచేప్పేస్తానంటే యెంత యేడుస్తున్నపిల్లలేనా వున్నపాళంగా కొయ్యబారిపోతారు. ఇదంతా కన్నమ్మఆకారవిశేషంవని కూడా చెప్పొచ్చు. కంఠవిశేషంవని కూడా చెప్పొచ్చు. మాటాడితే సప్తస్వరాలూ పలుకుతూవుంటాయి. ఆకారంలోమాత్రం రెండేరసాలు. ఏవేవంటారా? వొకటి భీభత్సరసం పూర్వసువాసినియవడంచేత తైలసంస్కారంలేక జుత్తు మహారణ్యంలాగుంటుది. జుత్తులోనేనా యక్కడక్కడ తెలుపుచాయలున్నాయి కాని శరీరానికిమాత్రం యెఖ్ఖడా లేవు. ఆ నల్లటి మొహంమీద తెల్లగా యింత విభూదిబొట్టు పెడుతూవుంటుంది. ఇన్నింటికంటే భయంకరమైందేంవిటంటే మెడకింద బాగా దబ్బకాయంత లావున్న కాయ ఈమెడకాయ బరువు దిగలాగడంచేత కాబోలు కిందిపెదవి పళ్ళనంటిపెట్టుకుండక అరచెయ్యి దళసర్ని యెఱ్ఱగా ముందుకు వేలాడుతూ వుంటుంది. అందుచే మొహం చూచేసరికి మనకు మొదట ప్రత్యక్షంవయేవి తెల్లనిపళ్ళూ పళ్ళకున్న యెఱ్ఱని కుదుళ్ళూ. ఇలాంటి స్థితిలో పిల్లలు జడుసుకుంటారూ అంటే కన్నమ్మ యేంచేస్తుందో చెప్పండీ పాపం. ఇహ రెండోరసంమాట విచారిద్దాం. నవరసాల్లోనూ యిదేరసంలో చేరుతుందో వాలుపోకుండా వుంది. ఈ రసానికి విధీవిరామం లేదనుకోండీ. యెప్పుడూ చలంవూరినట్లూరుతూ వుంటుంది. ఎండాకాలంలో యేళ్లేనా యెండిపోతాయి కాని త్రికాలాల్లోనూ కన్నమ్మ నోరెండడంవంటూ లేదు. వెనకటికి వోకవి "ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి......" అని యేంవేంవో గంగాప్రవాహాన్ని వర్ణించాడు. ఈ ప్రవాహాన్ని వర్ణించడం యెవరితరం! పుట్టుకెక్కడో తెలియదు. నాకు జాగ్రఫీరాదు. రెండుదౌడల సందులనుండీ రెండుపనదులుగా వచ్చి వచ్చి, వేలాడుతూవున్న పెదవి మధ్యకు

వచ్చేసరికి సరిగా రెండూకలనుకొని, అక్కడేవొకమహానదిగా యేర్పడి యీ పెదవిమధ్యనుండే యీ ప్రవాహం ప్రవహిస్తూవుంటుంది. పుట్టప్పుడు యెలాపోయినా కన్నమ్మదుకాణం మీదకూర్చున్నప్పుడు మాత్రం యీప్రవాహం సాధారణంగా వ్యర్థం కాదు. ఎంచేతంటారా? వూరేసిన నిమ్మకాయచట్టి ముందే పెట్టుకూర్చోడంచేత, దమ్మిడీ పుచ్చుకుంటుంది పక్కనేవున్న యిడ్డాకుముక్క తీస్తుంది. చట్టిలోవున్న చిన్న కఱ్ఱతెడ్డుతో ముక్కలూ వూటా వోమారు కలయకలుపుతుంది. రెండు నిమ్మకాయబద్దలు యింతవూట యీకులోవేసి యిస్తుంది దినదిన ప్రవర్ధమానం అన్నట్టు ఆ చట్టిలోవున్న వూటకు మరి తరుగుండదు. ఆనిమ్మకాయచట్టి అర్జునుడు తాలూకు అక్షయతూణీరంవంటిది. నాకుగాని మా యీవిడకుగాని శాస్త్రవాంట్లో సుస్తీగా వున్నట్లు విన్నాదీఅంటె ఆచట్టి పట్టుకొని తయారవుతూవుంటుంది. నిమ్మకాయ పత్యానికి మంచిదట. వట్టి ఛాయలాముండ వెఱ్ఱిఅభిమానం.

మన వోడియాల పురాణంలో కన్నమ్మకథ చిన్న వుపాఖ్యానం. ఇందాకటి ప్రశ్నకు సమాధానం చెప్తాను వినండి పెద్దమనిషియైన కన్నమ్మ వచ్చింది. తెచ్చిన మినప్పప్పుతో కొన్ని వొడియాలూ కొన్ని అప్పడాలూ కూడా పెట్టడానికేర్పాటు చేసింది. మా వుభయుల్నీ సమాధానపరిచింది. చాలిట్లో చుక్కలోడుస్తూ వెళ్ళిపోయింది. వెళ్ళగానే మాయీవిడ ఆచుక్కలు పడ్డచోట నీళ్ళుజల్లి శుద్ధిచేసి వెంటనే యప్పడాల వడియాల ప్రయత్నాలు ప్రారంభించింది. అయ్యో! సుఖపడే యోగం లేనివాడికి యెన్నిప్రయత్నాలు చేసినా యేంలాభం చెప్పండి! ఏవంటారా? బూడిదగుమ్మడికాయ తరగడం కోరడం పూర్తయేసరికి నాకు విశాఖపట్నంనుంచి అసిసరీసమను! వెళ్ళనా మానా? వెళ్ళకపోతే జడ్జీ యాభైరూపాయలు జరీమానా వేసేస్తాడే. అరగంటకింద తెలుస్తే కాయ తరగనీకపోదును. క్షణం మంచి కాదు. ఏం తెలుస్తుంది? నేను బెంగపెట్టుకూర్చున్నాను. మాయీవిడొచ్చింది. వొడియాలన్నీ నేను తినేస్తానేమో అని బెంగెట్టుకున్నారా అంది. మీరు తిరిగి వచ్చేసరికి యెండబెట్టి సిద్ధంగా వుంచుతాను. వెళ్ళిరండని నవ్వింది. వెఱ్ఱిమొహం దానికేంవిటి సమాధానం చెప్పడం? ఎండీ యెండని పచ్చి వొడియం వేయించుకొని తిండంలోవున్న మజా తెలిసేవుంటే అలా మాటాడి వుండదు. అలాంటి ఛాన్సు పోయిందని నా మొఱ్ఱ. సరేకాని ఆలా యెంతసేపు విచారిస్తాను? «ఆపదలందు ధై ....» మను పద్యం జ్ఞాపకం తెచ్చుకున్నాను. మనసు దృఢం చేసుకున్నాను.

"తలపేటికి నాటి కొక్క దైవములేడే" యని భగవంతుడిమీద భారంవేశాను. యెలాగైతేనేం విశాపట్టంవెళ్ళాను. కోర్టుకెటెండయాను. అయ్యా! పెద్దకూనీకేసు. యాభైమంది సాక్షులట! విన్నారా? ఈ కేసు పూర్తికావడం యెప్పుడు? నేనిల్లు చేరుకోడం యెప్పుడు? విస్తట్లో వొడియాలు నాకంటపడ్డం యెప్పుడు? చెప్పానుకానండీ విధి-విధి-విధి- దిక్కుమాలిన విధి మాచెడ్డది.

శుక్రవారానికి శుక్రవారం యెనిమిది-శనివారం తొమ్మిది. అదివారం పది-పదకొండోరోజు సాయంకాలం నాలుగు గంటల బండిలో యింట చేరుకున్నాను- ఆకలేంవిటి? దహించుకుపోతూంది. పెందరాళే వంట కానీమన్నాను వొడియాలు వేయించి చారు పెడితే చాల్నా అని యడిగింది. అన్నంవార్చి వొడియాలు వేయించేసింతరువాత చారు పొయ్యిమీదపెట్టి నా కొడ్డించేమన్నాను. మరక్కుండా యెలా వడ్డించడంవంటుంది. అదంతా నీకెందుకంటాను. చారక్ఖర్లేదా అంటుంది. నేను చెప్పినట్లుచేస్తూ అంటాను. ఈప్రశ్నలన్నీ అమాయకంగా అడిగిందనుకున్నారేంవిటి? వట్టి వేళాకోళంవని నమ్మండి. నేను వొడియాలతో కథ ప్రారంభించానూ అంటే వాకంతకి తెంవల్దన్న భోగట్టా యెరుగును. మొదటివాయ-రెండో వాయ. మొత్తం రెండువాయలు నాకు మామూలు. మొదటిది ఎలిమెంటరీకోర్సనండి. రెండోదిఎడ్వాన్సుకోర్సనండి-డీటేల్సు మనవిచేస్తాను. ఎలిమెంటరీకోర్సులో యేముక్కాముక్కే విరవడం. అన్నంలో పోదపడం. వుండకట్టడం. పుచ్చుకోవడం. ఇదీ థీరీ. ఎడ్వాన్సుకోర్సుమాత్రిం ఇంతకంటె కాస్త కాంప్లెక్సుగానే వుంటుంది. ఏంవంటారా? యోగం ముదిరినకొద్దీ జీవుడూ పరమాత్మా యైక్యంవయిపోయేటట్టు, రుచి మరిగినకొద్దీ అన్నం వొడియాలూ అవినాభావం వహించాలి. ఇందులో ముక్కకు ముక్కా పిడచకు పిడచా వీల్లేదు. వొడియాలన్నీ మొదట గుండచేసీడం. ఆగుండ పిడికిళ్ళతో తీసి రెండోవాయలో గుచ్చెత్తడం. నెయ్యివేసి నాలుగుమూల్లా బాగా మెదాయించకం. ఇలాంటి చిక్కులుంటాయి. ఈ డెవలప్మెంటు మనవాళ్ళలో చాలామందికి తెలియదనుకుంటాను. చెప్పొచ్చే మాటేంవిటీయంటే యీ రెండువాయలూ నేను పూర్తిచేసేసరికి రెండుశేర్ల చారు మరిగించడానికి టైముంటుంది.

నేను చికాగ్గా వున్నానని మా ఆవిడ అధికప్రసంగం చెయ్యక నవ్వుతూ లోపలికి వెళ్ళింది. వంట ప్రారంభించింది. అయిదోగంట కూడా వేశారు. ఆరూ అయేసరికి వంటయిపోవాలని మానాన్నిద్వారా

అర్డరు కమ్యూనికేటు చేశాను. వంటనగా యేపాటి? ఇస్తోకుపొడి. సావిట్లో నేకొంత సేపీజీచైరులో పడుకున్నాను. కొంతసేపిటూ అటూ పచారుచేశాను. వోసిగరెట్టు కాల్చాను. మరికొంచెం సేపుకే ఘుమ్మని వడియాలవాసన కొట్టడం ప్రారంభించింది, ఆవాసనపట్టే యేదో వొక వొడియం మాడిపోయివుండాలని గ్రహించాను. తగలెట్టేస్తున్నావని కేకవేస్తూ గబగబ లేబరేటరీలోకి పరుగెత్తేను. అయితే యీశ్వరానుగ్రహంవల్ల ఆ మాడిపోయిందప్పడంకాని వొడియం కాదు. సీతాంకాలపొద్దా ఇట్టేదీపాలు పెట్టేశారు. వంట నట్టింటిలో పెట్టి మాయావిడ వడ్డించేసింది. కాళ్లుకడుకున్నాను. పట్టుపంచ కట్టుకొన్నాను. పీటమీద కుర్చున్నాను. పరిషించాను. నెయ్యివెచ్చబెట్టి తెచ్చేలోపుగా వొకవొడియం ఫలహారం చేదామని బుద్ధిపుట్టింది. ముక్క విరవబోయాను. విరిగిందికాదు. గట్టిగా విరవబోయాను. అప్పుడూ విరగలేదు. మరింతగట్టిగా విరవబోయాను. విరగలేదు. మరోపక్క తిప్పేను. విరగలేదు. ఇంకోపక్క తిప్పేను. విరగలేదు. అందుంచీసి మరో వొడియం తీశాను. అదీ అంతేఅయింది. యింకో వొడియం తీశాను. లాభంలేకపోయింది. మరో వొడియంతీశాను. చెయ్యి పీకెట్టింది. ప్రాణంకూడా విసిగింది. వొడియాలేంవింత గట్టిగా వున్నాయన్నాను. మరి మెత్తగా వుంటాయా అంటూ ముందరన్నంమీద నెయ్యి వేసేసింది. కానీ చూతాం బ్రి-బ్రి-బ్రి యెగేంయ్ అన్నాడని మరో వొడియం తీశాను. వేరేవుంచాను. పిడికిలి గట్టిగా బిగించాను. సత్తువకొద్దీ దానిమీద వొకగుద్దు గుద్దేను. ఆగుద్దుతో వొడియం చెక్కుచెదరలేదు సరికదా నాచెయ్యి చీరుకుపోయింది. ప్రాణం జిల్లార్చుకుపోయింది. విస్తట్లోకి రక్తం చిమ్మింది. ఏంవటూ మోటూపని నోటితో కొరుక్కొండని మా ఆవిడ కోంపడ్డది. చెయ్యి స్వాధీనం తప్పింతరువాత యిహ నోరు కాకపోతే మరేంవాయుధంవుందన్నాను. కొంచెం రెస్టుతీసుకొని మళ్ళా మరోవొడియం వందుకున్నాను. సరీగా కిందిదంతాలికి మీదిదంతాలికి మధ్యను పెట్టేను. పిడికిళ్ళు బిగించాను. వూపిరి బిగబట్టేను. సత్తువకొద్దీ నొక్కడానికి ప్రారంభించాను. కళ్ళంట నీళ్ళు కారిపోతున్నాయి. మొహం యెఱ్ఱగా అయిపోయింది. కంఠంలోవున్న రక్తనాళాలు పైకుబ్బుతున్నాయి. యిదే సర్కస్సయితే యీపాటికోగోలను తెంపేసుందునేమో? వొడియంమాత్రం విరగలేదు. చిన్నగంటైనా పళ్లేదు. ఫైనలుగా ఒక్కజర్కిద్దాంవనుకొన్నాను. కుడికన్ను మూసేసి గడ్డాంకింద చెయ్యిపెట్టి మా గొప్పప్రోకిచ్చాను దాంతో వొడియం



http://www.maganti.org/

పక్కకి జారిపోయింది నాలుక్కరుచుకు పోయింది.

అయ్యా నోరంతా రక్తమండలం!

ఇహా నేమ్మనవి చెయ్యగల్ను? తిండీవద్దు తిప్పలువద్దు. పోయి పరుంటాను. క్షమించండి.

(సశేషము.)